# పరిణతవాణి స్వర్ణోత్సవ ప్రసంగం

## 05-03-2010, శుక్రవారం సా.6.00 గంటలకు

## జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

## డా. సి. నారాయణరెడ్డి స్వీయ సాహిత్య, జీవిత విశేషాలు

**1. జననం, స్వస్థలం:**

**ఎవరికి ఈ సన్మానం**

**అమ్మగా సింగిరెడ్డి బుచ్చమ్మగా / పదుగురు పాలేర్లున్నా / ఉర్దూనే విద్యార్థిగా / ఎంత పైకి ఎదుగుతున్నా / సముద్రాలతో గీసిన / ఏ ఋతువైనా నరాల తీరాలను / అనుభవాల వెన్నెముద్దలారగించిన / పేరేమో సింగిరెడ్డి నారాయణరెడ్డి.**

29-07-1931 - గురుపూర్ణిమ

కరీంనగర్ జిల్లా, వేములవాడ మండలం, హనుమాజీపేట గ్రామం.

తండ్రి-మల్లారెడ్డి - అరక పట్టిన రైతు.

తల్లి-బుచ్చమ్మ.

మాది రైతు కుటుంబం.

మా ఇంటిపేరు సింగిరెడ్డి. పుట్టినప్పుడు పెట్టిన పేరు సత్యనారాయణరెడ్డి. సంతానం కోసం మా తల్లి సత్యనారాయణ వ్రతం చేసిన తర్వాత నేను జన్మించానట. అందుకే ఆ పేరు పెట్టారు. అయితే సిరిసిల్ల మాధ్యమిక పాఠశాలలో మా నాయన నన్ను చేర్పించినప్పుడు సి. నారాయణరెడ్డి అని రిజిస్టరులో రాశారు. అదే స్థిరపడింది.

**2. విద్యాభ్యాసం:**

| | | |
|---|---|---|
| ప్రాథమికస్థాయి | – | హనుమాజీపేటలో పాఠశాల లేదు. ప్రయివేటు టీచరు నడిపిన వీధిబడిలో అక్షరాభ్యాసం. అక్కడే చదువు. అలా ప్రారంభమయింది నా చదువు. |
| మాధ్యమికస్థాయి | – | సిరిసిల్ల – ఉర్దూ మాధ్యమం. తెలుగు ఒక ఐచ్ఛికాంశంగా చదువుకున్నాను. |
| ఉన్నతపాఠశాల స్థాయి | – | కరీంనగరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో పూర్తి చేశాను. |
| ఇంటర్మీడియటు | – | చాదర్‌ఘాట్ కాలేజీ, హైదరాబాదు ఉర్దూ మాధ్యమంలో చదివాను. ఇంటరు విద్యార్థిగా శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయంలో సభ్యునిగా చేరి రాయప్రోలు, గురజాడ, కృష్ణశాస్త్రి, జాషువా, కరుణశ్రీ, శ్రీశ్రీ – ఇలా భావకవుల అభ్యుదయ కవుల రచనలు చదివాను. ఆధునిక తెలుగు కావ్యాలు చదవడం అదే ప్రథమం అని చెప్పాలి. నా రచనలను గురించి, చలనచిత్ర గీతాలను గురించి తరువాత చెబుతాను. |
| బి.ఏ., ఎం.ఏ.(తెలుగు) | – | ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదివాను. |
| పిహెచ్.డి. | – | ఉస్మానియా విశ్వవిద్యాలయం. నా పరిశోధన గ్రంథం |

'ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు, ప్రయోగములు'. దానిలో భావ కవిత్వానికి ఆద్యుడు రాయప్రోలు అని నిరూపించాను. ఇందులో సమన్వయ సూత్రాన్ని ప్రాతిపదికగా తీసుకున్నాను. కె.వి. రమణారెడ్డి వంటి విమర్శకులు దీనిని ఆమోదించారు. నేను మరొకదానిపై పరిశోధన చేయాలనుకుంటే ఒక సందర్భంలో ప్రస్తావన

వచ్చినప్పుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి ఈ అంశంపైన ఎవరూ పరిశోధన చేయలేదు, నన్ను చేయమని సూచించారు.

గురువులు – ఆచార్య కె. గోపాలకృష్ణారావు
ఆచార్య పల్లా రుద్రయ్య
ఆచార్య దివాకర్ల వెంకటావధాని

**3. అధ్యాపకత్వం:**

మొదట సికిందరాబాదులో వున్న ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, తర్వాత నిజాం కళాశాలలో లెక్చరరుగా పని చేశాను. పిమ్మట విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో రీడరుగా, ప్రొఫెసరుగా 1981 వరకు బోధన కొనసాగించాను.

అప్పటికి ఇంకా 11 సంవత్సరాల సర్వీసు వుంది. అప్పుడు పదవుల పర్వం ఆరంభమయింది. ఆ వివరాలలోకి వెళ్ళేముందు నా కుటుంబం గురించి రెండు మాటలు చెప్పాలి.

**4. కుటుంబం:**

భార్య – శ్రీమతి సుశీల – దివంగతురాలు. ఆమె స్మృత్యంకంగా శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు స్థాపించాను. ప్రతి సంవత్సరం ట్రస్టు ఉత్తమ రచయిత్రికి రూ.50 వేలు నగదు పురస్కారం అందజేస్తుంది. ఆమె పేరిట తెలుగు, సార్వత్రిక విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు స్వర్ణ పతకాలు ఏర్పాటు చేశాను.

నలుగురు కుమార్తెలు – గంగ, యమున, సరస్వతి, కృష్ణవేణి. నలుగురు అల్లుళ్ళు భాస్కరరెడ్డి, సురేందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి. నా తల్లి బుచ్చమ్మే మా పెద్దమ్మాయి గంగ పుట్టిందా అన్నట్టు నాతోపాటు అందరినీ కంటికి రెప్పలా చూసుకుంటుంది.

మనమలు, మునిమనవళ్ళు, మనవరాళ్ళు, మునిమనవరాళ్ళు ఇల్లంతా సందడే. మా మునిమనవరాలు వరేణ్యా బాల ఆంగ్ల కవయిత్రి. ఆమె రచించిన 'టెండర్ రేస్' కవితా సంపుటి ఇటీవల విడుదలయింది.

**5. నన్ను వరించిన పదవులను గురించి సంగ్రహంగా:**

**1. అధికార భాషా సంఘం అధ్యక్ష పదవిని** 04-09-1981 నుంచి 07-8-1985 వరకు నిర్వహించాను.

**కొన్ని ముఖ్య ఘట్టాలు:**

1) రూ. 3 కోట్ల వ్యయంతో 14 వేల తెలుగు టైపురైటర్ల సేకరణ. ఒకేసారి ఇన్ని కొనడం భారతీయ భాషల్లో రికార్డుగా నిలిచింది.

2) 40కి పైగా ప్రభుత్వ శాఖల పదకోశాలకు రూపకల్పన చేశాం.

3) 'కార్యాలయ పదావళి'. 'నమూనా లేఖలు' ప్రచురించాం.

4) రాష్ట్రమంతటా విస్తారంగా పర్యటన జరిపి ప్రజలలో, ఉద్యోగులలో అవగాహన పెంచగలిగాం.

5) జిల్లా స్థాయిలో అమలు 75% వరకు తెలుగు వాడుక పెరిగింది.

6) తెలుగు పరిశోధనా విభాగం ద్వారా సాంకేతికంగా తెలుగును పరిపుష్టం చేశాం.

**2. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నేటి డా. బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్ష పదవి** 08-08-1985 నుంచి 20-06-1989 వరకు నిర్వహించాను. తొలి ఉపాధ్యక్షులు ఆచార్య జి. రామిరెడ్డి. ఇది దేశంలోని ప్రథమ సార్వత్రిక విశ్వవిద్యాలయం.

**కొన్ని ముఖ్య ఘట్టాలు:**

1) జూబ్లీహిల్స్‌లో 54 ఎకరాల స్థలం కేటాయింపు పొందడం. అదే వికాస్ నగర్.

2) జాతీయస్థాయిలో విశ్వవిద్యాలయ భవనాల డిజైన్ల పోటీ నిర్వహణ.

3) జిల్లాలలో 57 అధ్యయన కేంద్రాల ఏర్పాటు.

4) విద్యార్థుల సంఖ్య 50 వేలు దాటింది.

5) 1070 లిఖితరూప పాఠాలు, 175 ఆడియో పాఠాలు, 103 వీడియో పాఠాల రూపకల్పన.

6) ఆరుబయలు స్థలంలో 28-3-1987న ప్రథమ స్నాతకోత్సవ నిర్వహణ. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పాఠక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

**3. తెలుగు విశ్వవిద్యాలయం - నేటి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం - ఉపాధ్యక్ష పదవిని** 21-6-1989 నుంచి 04-11-1992 వరకు నిర్వహించాను.

ఇక్కడ కూడా నేను రెండవ ఉపాధ్యక్షుణ్ని కావడం విశేషం. ఆచార్య తూమాటి దొణప్ప ప్రథమ ఉపాధ్యక్షుడు. విశ్వవిద్యాలయానికి కావలసిన ముఖ్యావసరాలను సమకూర్చడం నావంతయింది. నా పదవీకాలంలో కొన్ని ముఖ్యఘట్టాలు పేర్కొంటున్నాను.

**కొన్ని ముఖ్య ఘట్టాలు:**

1) యు.జి.సి. గుర్తింపు.

2) పబ్లిక్ గార్డెన్స్‌లో ఇచ్చిన స్థలంలో భవన నిర్మాణం. భవన ప్రవేశం 31-1-1990న జరిగింది.

3) కూచిపూడిలో కళాక్షేత్రం విశ్వవిద్యాలయ పరిధిలోకి తీసుకువచ్చాను.

4) తెలుగులోనే 24-8-1989న ప్రథమ స్నాతకోత్సవ నిర్వహణ. అప్పుడు ఛాన్సలర్ నటమూర్ధన్యులు, ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారకరామారావు గారు స్నాతకోత్సవంలో ధరించే తలపాగాకు, గౌనుకు స్వయంగా రూపకల్పన చేశారు. భారత ఉపరాష్ట్రపతి డా. శంకరదయాళ్‌శర్మ గారు ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

రెండవ స్నాతకోత్సవం 07-07-1991న జరిగింది. నాటి ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావు గారు ముఖ్యఅతిథిగా వచ్చారు.

**విశ్వవిద్యాలయం నిర్వహించిన మరికొన్ని ముఖ్య కార్యక్రమాలు:**

5) 30 మంది ప్రముఖులపై వీడియో డాక్యుమెంటేషన్.

6) పరిష్కృత విజ్ఞాన సర్వస్వ సంపుటాలతో పాటు 150కి పైగా ఉత్తమ గ్రంథాల ప్రచురణ.

7) 1990 మార్చి 10, 11, 12 తేదీలలో బెంగుళూరులో మూడవ అఖిల భారత తెలుగు మహాసభల నిర్వహణ.

8) నాటి ముఖ్యమంత్రి డా. మర్రి చెన్నారెడ్డి గారి ప్రోత్సాహంతో తెలుగు విశ్వవిద్యాలయం 1990 సెప్టెంబరులో మారిషస్‌లో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించింది.

9) విశిష్ట పురస్కారం ఏర్పాటు – సాహిత్యం, కళలు, సంస్కృతి రంగాలలో.

10) విస్తరణ సేవా విభాగం ద్వారా పూర్వం వున్న 5 అకాడమీ కర్తవ్యాల నిర్వహణ.

తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షునిగా వున్న కాలంలో రెండు నెలలు పైగా కాకతీయ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్ష బాధ్యతలను నిర్వహించాను.

**7. రెండు విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్ష పదవి తర్వాత ప్రభుత్వం నన్ను భాషా సాంస్కృతిక వ్యవహారాల సలహాదారుగా నియమించింది.**

ఇది ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో వున్న ఉన్నత పదవి 05–11–1992 న పదవీ బాధ్యతలు చేపట్టాను.

1) ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు భాషా, సాంస్కృతిక వికాసాలపై సూచనలు చేశాను.

2) రాజధానిలో కళానికేతన్ (కల్చరల్ కాంప్లెక్స్) నిర్మాణానికి పథకం ప్రభుత్వానికి సమర్పించాను. ఇది సర్వాంగీణ కళా ప్రాంగణం వంటిది. ఆధునిక దృశ్య–శ్రవణ సాంకేతిక విజ్ఞానం నింపుకునే చరిత్ర, సాహిత్య, సంగీత, నృత్య నాటక, చిత్రకళ, శిల్పకళ, జానపద, గిరిజన విభాగాలు, ప్రదర్శనశాలలు, రంగస్థలాలు, డాక్యుమెంటేషన్ విభాగం మొదలైనవి వుంటాయి.

**8. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్ష పదవి**

ఇది కేబినెట్ మంత్రి హోదా వున్న ఉన్నత పదవి. 1997 జులై నుంచి 12–07–2004 వరకు ఈ పదవీ బాధ్యతలు నిర్వహించాను. మండలి ఎన్నో విలక్షణ కార్యక్రమాలు రూపొందించి నిర్వహించి, సాంస్కృతిక సంస్థలకు విశేష స్ఫూర్తినిచ్చింది. సాహిత్యంతో పాటు అన్ని కళారంగాల వారికి మార్గదర్శిగా నిలిచింది. ఈ సందర్భంలో సమయాభావం వల్ల కొన్ని కార్యక్రమాల పేర్లు మాత్రమే చెప్పేందుకు సాధ్యపడుతుంది. అవి –

1) సాంస్కృతిక విధానంపై జాతీయ సదస్సు.

2) సాంస్కృతిక వికాసోత్సవం – రాష్ట్రంలో 73 ప్రముఖ సంస్థలు సాంస్కృతిక వికాసానికి 103 సూచనలు చేశాయి.

3) హంస పురస్కారాలు – రూ. 30 వేల నగదు, బంగారుపూతతో స్వర్ణ హంస ప్రతిమ, ప్రశంసా పత్రం, శాలువా. ఈ పురస్కారాలను కళారంగాలన్నీ ప్రతిష్ఠాత్మకమైనవిగా పరిగణించాయి.

4) నవల, కథానిక, పద్యం, గేయం, వచన నాటకం, సాహిత్య విమర్శ, ప్రసార మాధ్యమ రచనా విధానాలు – ఈ 8 ప్రక్రియల్లో రచయితల అధ్యయన శిబిరాలు.

5) సమైక్య రాగాత్మ (కర్నాటక, హిందుస్తానీ, అరబిక్, పాశ్చాత్య సంగీత సంప్రదాయాల సామ్య నిరూపణ).

6) లయ సంగమం (10 చర్మ వాద్యాల లయ గతుల సమ విన్యాసం).

7) పద్య నాటకోత్సవాలు.

8) గిరిజన భాషా సాహిత్యాలు.

9) రాష్ట్రస్థాయి చిత్రలేఖన, శిల్పకళాల పోటీ.

**9. రాజ్యసభ సభ్యత్వం**

నేను రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షునిగా వుండగానే భారత రాష్ట్రపతి నన్ను రాజ్యసభ సభ్యునిగా నామినేటు చేశారు. దీని కాలపరిమితి ఆరు సంవత్సరాలు. 27-08-1997 నుంచి 26-08-2003 వరకు సభ్యునిగా వున్నాను.

దక్షిణ భారతం నుంచి నామినేటు అయిన ప్రథమ కవిని నేనే కావడం విశేషం. 12 మంది మాత్రమే నామినేటు అవుతారు. నాతోపాటు రాజా రామన్న, షబానాఅజ్మీ, కులదీప్ నయ్యర్ వంటి ప్రసిద్ధులు ఇలా నామినేటు అయినవారిలో వున్నారు.

**కొన్ని ముఖ్య ఘట్టాలు:**

**ప్రశ్నలు:** నేను వేసిన ప్రశ్నలు 624. ఇందులో ప్రధాన ప్రశ్నలు అనుబంధ ప్రశ్నలు వున్నాయి. ఉదాహరణప్రాయంగా కొన్ని ప్రశ్నలలోని అంశాలు పేర్కొంటాను.

1) గాంధీజీని న్యూనపరుస్తూ **'మాక్సిమ్'** పత్రిక ప్రచురించిన కథనం.

2) దేశంలోని వివిధ రాష్ట్రాలలో సాంస్కృతిక వికాసానికి దోహదకరంగా ఆర్థిక సహాయం చేసే నిమిత్తం సాంస్కృతిక నిధి ఏర్పాటు.

3) కంప్యూటర్లలో భారతీయ భాషల వినియోగం

4) వైద్య కళాశాలలో శిక్షణ పొందకుండా దొంగ సర్టిఫికెట్లతోనో, మరోవిధంగానో వైద్యులుగా చలామణి అవుతూ ప్రజల ప్రాణాలతో ఆడుకునే నకిలీ వైద్యులు.

5) సంస్కృత భాషా వ్యాప్తికి తోడ్పడే నిమిత్తం కేంద్ర విశ్వవిద్యాలయాలలో సంస్కృత పీఠాలు

6) ఇతర దేశాలలో తెలుగువారి కోసం ఆకాశవాణి ప్రసారాలు.

7) హైదరాబాదులోని ప్రాగాటూల్స్ సంస్థకు నిర్వహణ మూలధనం మంజూరు.

8) దేశంలో సహకార బ్యాంకులు పని తీరు.

**ప్రత్యేక ప్రస్తావనలు:**

మొత్తం 32 సార్లు ప్రత్యేక ప్రస్తావనలు చేసే అవకాశం నాకు లభించింది.

ప్రస్తావన చాలా విశేషమైన సభా కార్యక్రమం. కొన్ని ఉదాహరణలు.

1) గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్‌లో గాంధీజీ చదివిన ఆల్‌ఫ్రెడ్ హైస్కూలు దుస్థితి. దాని పేరు ఇప్పుడు మోహన్‌దాస్ గాంధీ హైస్కూలు. ఇందులో వున్న 18 గదుల్లో 10 గదులకు తలుపులు, కిటికీలు లేవు. ప్రార్థనా మందిరాన్ని పనికిరాని వస్తువులు వుంచేందుకు వాడుతున్నారు. నేను దాని మరమ్మత్తుకు ఎంపి లాడ్స్ నిధుల నుంచి రూ.5 లక్షలు ఇస్తానని ప్రకటించాను.

2) ఒరిస్సా రాష్ట్రం కటక్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మించిన జానకీనాథ్ భవనం దుస్థితి. ఈ భవనాన్ని నేను స్వయంగా చూశాను. నా ప్రస్తావనను రాజ్యసభలో ఇతర సభ్యులు – నేటి ప్రధాని మన్మోహన్‌సింగ్, రాజారామన్న, చిత్తరంజన్, సతీశ్‌ప్రధాన్, టి.ఎన్. చతుర్వేది, విడుత్తలై విరుంబి ప్రభృతులు బలపరిచారు.

3) ఆస్ట్రేలియా దేశం మెల్బోరన్ సమీపంలో వున్న **'గోల్డ్ మ్యూజియం'** లో గుప్తుల కాలం నాటి బంగారు నాణేలపై లక్ష్మీదేవి చిత్రాలున్నాయి. వాటి గురించి తెలిపే అసభ్యకర వివరణపై నా ప్రత్యేక ప్రస్తావన. నా ప్రసంగంలో – 'మహావిష్ణువు అర్ధాంగి లక్ష్మీదేవి సంపద సౌభాగ్యాల అధిదేవత. ఆమె జగన్మాత. సప్తమాతృకలలో ఒకరుగా పవిత్ర స్థానం వహించిన ఆ దేవతను విషయాసక్తగా, విమోహకమూర్తిగా – సెన్సుయస్ లక్ష్మి, సెడక్టివ్ లక్ష్మి గా వర్ణించడం అత్యంత అభ్యంతరకరం' అన్నాను. నా అభ్యంతరం ఆధారంగా తర్వాత ఈ వివరణ తొలగించారు.

4) భారత జాతీయ పతాక రూపశిల్పి శ్రీ పింగళి వెంకయ్యకు సముచిత గౌరవం ఇవ్వాలని కోరే ప్రస్తావన. కృష్ణాజిల్లా భట్ల పెనుమర్రు గ్రామంలోని ఆయన గృహం నేడు పశువులపాకగా వాడుతున్నారు. అటు ఇంటిని స్మారకచిహ్నంగా గుర్తించి జీర్ణోద్ధరణ చేయాలని, ఆయనకు తగిన గౌరవ ప్రతిపత్తి ఇవ్వాలని సూచించాను.

**బిల్లులు:**

నేను ప్రతిపాదించిన వాటిలో ప్రధానమైంది మాతృభాష (నిర్బంధ బోధన, అధ్యయనం) బిల్లు. ఇది విద్యార్థి చదివే భాషల్లో మాతృభాష తప్పక వుండాలని నిబంధిస్తుంది. భారత రాజ్యాంగం 8వ షెడ్యూలులో పేర్కొన్న భాషలకు దీనిని వర్తింపజేయాలని నేను తెలియజేశాను.

**పార్లమెంటరీ సంఘాలు:**

అధికారభాష; శాస్త్ర సాంకేతిక; పర్యావరణ, అటవీ వ్యవహారాలు; మానవ వనరుల అభివృద్ధి; సమాచార ప్రసార సంబంధమైన – పార్లమెంటు సంఘాలలో సభ్యునిగా ఉన్నాను.

**విదేశీ పర్యటన**:

16–03–2003న మొరాకోలో జరిగిన ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ మహాసభలో భారత ప్రతినిధి వర్గ సభ్యునిగా పాల్గొన్నాను. తిరుగు ప్రయాణంలో పారిస్ లోని 'యునెస్కో' 'కార్యాలయం సందర్శించి – హైదరాబాదుకు ప్రపంచ వారసత్వ నగర ప్రతిపత్తి ప్రకటించాలని సవివర నివేదిక అందజేశాను.

**ఎంపి లాడ్స్ నిధుల కేటాయింపు:**

రాజ్యసభ సభ్యునిగా కేంద్ర ప్రభుత్వం 6 సంవత్సరాలకు నాకు కేటాయించిన మొత్తం రూ. 11.5 కోట్లు.

నామినేటు అయిన సభ్యునిగా దేశంలోని ఏ ప్రాంతానికైనా నేను పథకాలకు ఈ నిధి నుంచి ఆర్థిక సహాయం అందించే వెసులుబాటుంది. ఈ పథకాలు వందల సంఖ్యలో వున్నాయి. మచ్చుకు కేటాయింపు పొందిన కొన్ని పథకాలను పేర్కొంటాను.

1) కటక్‌లో నేతాజీ జన్మించిన 'జానకీనాథ్' భవనం పునరుద్ధరణ.

2) ఒరిస్సా వరద బాధితుల సహాయ నిధి.

3) గుజరాత్ భూకంప బాధితుల సహాయ నిధి.

4) షోలాపూర్‌లోని పద్మశాలి విద్యాసంస్థ భవన నిర్మాణం.

5) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'నీరు-మీరు' పథకం.

6) కరీంనగర్‌లో సారస్వత సదన్ భవన నిర్మాణం.

7) వేములవాడలో సాహితీసదన్ భవనం నిర్మాణం.

8) కరీంనగర్ వట్టెపల్లెలో అంబేద్కర్ కమ్యూనిటి హాలు నిర్మాణం.

9) సిరిసిల్ల పురపాలక సంస్థ ఆడిటోరియం నిర్మాణం.

10) ఆంధ్ర సారస్వత పరిషత్తు తెలుగు పండిత శిక్షణ కళాశాల భవన నిర్మాణం (ఈ కేటాయింపు జరిగిన కాలంలో నేను పరిషత్తు అధ్యక్ష పదవిలో లేను)

11) వేగేశ్న వికలాంగుల సంస్థ భవన నిర్మాణం.

12) కడపలో సి.పి. బ్రౌను గ్రంథాలయ భవన నిర్మాణం.

**10. సాహితీ ప్రస్థానం:**

ఇది ఏడు దశాబ్దాల సుదీర్ఘ నిరంతర యాత్ర. అతి సంగ్రహంగా మాత్రమే చెప్పే వీలుంది. బాల్యంలో విన్న హరికథలు, జానపద గీతాల ప్రభావం నాపైన కొంత వుంది. సహజమైన సృజనాత్మక శక్తి, లయాత్మకత ఉపకరించాయి. విద్యార్థిగానే పద్య రచనకు శ్రీకారం చుట్టాను. ఏడో తరగతిలో వున్నప్పుడు 'ఒకనాడు ఒక నక్క అడవిలో నుండి పొట్ట కోసము యెటు పోవుచుండె' అనే పంక్తితో ప్రారంభించి పద్యం రాశాను. అది సీస పద్యమని నాకప్పుడు తెలియదు. పద్యం చదివిన ఉపాధ్యాయుడు శ్రీ వెంకట రమణాచార్యులు సీస పద్యమని చెప్పి కొన్ని మెలకువలు సూచించారు. అది నా తొలి రచన. అది ప్రచురణ కాలేదు. నేను రాసిన తొలి గేయం పల్లవి 'మారుటెన్నడో విషంపు గుండెలీ జగానా.. మారుటెన్నడో' అప్పుడు తొమ్మిదో తరగతిలో వున్నాను. విద్యార్థిగా అలవోకగా పద్యాలు, గేయాలు, గీతాలు రచించాను. జువ్వాడి గౌతమరావు సంపాదకత్వాన వెలువడే 'జనశక్తి' పత్రికలో నా కవిత తొలిసారి ప్రచురితమైంది. అప్పుడే నా పద్య నాటికలు 'ప్రహ్లాద

చరిత్ర', 'సీతాపహరణం' రాశాను. 'భలే శిష్యులు' వంటి సాంఘిక నాటికలు రాశాను. మా వూళ్ళో వాటిని ప్రదర్శించేవాళ్ళం. నేనూ పాత్రధారణ చేశాను.

మొదట పద్య రచన చేసినప్పటికీ గేయం పైనే దృష్టి లగ్నం చేశాను. కారణం చెప్పాలి. ఆ రోజుల్లో కావ్యమంటే పద్య రచనే. గేయంలో సమగ్ర కావ్యాలు రాలేదు. సాహితీరంగంలో నాదైన స్థానం సమకూర్చుకోవాలంటే పద్యం కంటే గేయమే నాకు బలీయ సాధనంగా తోచింది. ఉద్దండులైన పద్య కవులున్నారు. కవిగా మొగ్గ తొడుగుతున్న దశలో పద్య కవిత రాశాను. ఇందుకు జలపాతం మంచి ఉదాహరణ. పద్య కావ్యాల స్థాయిలో ప్రౌఢ సమాసబంధురంగా కథాత్మక గేయ కావ్యం రాయాలని సంకల్పించాను. దాని పర్యవసానమే 'నాగార్జున సాగరం' 1955లో వెలువడింది. ఇది తెలుగులో ప్రప్రథమ కథాత్మక గేయ కావ్యమని విమర్శకులు భావించారు. ఆ కావ్యం ఇలా ప్రారంభమవుతుంది–

**ఇక్ష్వాకు వంశక్షి**
**తీంద్ర చంద్రుల కీర్తి**
**కౌముదులు నల్గడల**
**కలయ విరిసిన నాడు**
**కృష్ణవేణీ తరం**
**గిణి పయః కింకిణులు....**

అలా పయనిస్తూ పద్యాలు, గేయాలు, గేయ నాటికలు, గీతాలు, దీర్ఘ కావ్యాలు, వచన కవితలు, గజళ్ళు, బుర్రకథలు, సాహితీ విమర్శ, గద్య కృతులు, ముక్తకాలు, కవితా సంపుటాలు, అనువాదాలు మొదలైనవి 79 కృతులు అందించాను.

సామాజిక చైతన్య ప్రబోధమే నా కవిత్వ ప్రధాన లక్ష్యం. నేను ఎంచుకున్నది ప్రగతిశీల మానవతావాదం. నా కవితలో ఇది అంతర్నిహితంగా ప్రవహిస్తుంది. నా రచనలపై ఎందరో ఎం.ఫిల్., పిహెచ్.డి. చేశారు. అనేక విమర్శన గ్రంథాలు రచించారు. జీవితం–సాహిత్యం పైన సమగ్ర రచనలు వచ్చాయి. దూరదర్శన్ ధారావాహికలు ప్రసారం చేసింది. ఇవి అందరికీ తెలిసినవే.

**11.** నా గ్రంథ ప్రచురణ 1953లో 'నవ్వని పువ్వు'తో ప్రారంభమయింది.

జలపాతం, విశ్వగీతి, అజంతా సుందరి, మా వూరు మాట్లాడింది, నాగార్జునసాగరం, కర్పూర వసంతరాయలు, విశ్వనాథనాయడు, ప్రపంచపదులు, సినారె గజళ్ళు, సినారె గీతాలు, ఋతుచక్రం, మరో హరివిల్లు, గాంధీయం, ముత్యాల కోకిల, మంటలూ–మానవుడూ, మార్పు నా

తీర్పు, ఇంటి పేరు చైతన్యం, భూమిక, విశ్వంభర, మట్టి–మనిషి–ఆకాశం, రెక్కలు, కవిత నా చిరునామా, మనిషిగా ప్రవహించాలని – ఇలా నిరంతర గమనం సాగుతోంది. నా కవితా సంపుటి ఆవిష్కరణే నా జన్మ దినోత్సవం. వచ్చే జులై నెలలో 80వ ప్రచురణ ఆవిష్కరించాలి.

రామప్ప సంగీత రూపకం అన్ని భారతీయ భాషల్లోకి అనువాదమైంది.

నా కావ్యాలు కొన్ని ఇంగ్లీషు, ఫ్రెంచి, సంస్కృతం, హిందీ, ఉర్దూ, కన్నడం, మళయాళం, తమిళం మొదలైన భాషల్లోకి అనువాదాలయ్యాయి.

**12. చలనచిత్ర గీత కర్తృత్వం నా సాహితీ మూర్తిమత్వానికి మరో పార్శ్వం:**

1962 'గులేబకావళి కథ' చిత్రంలో 'నన్ను దోచుకొందువటె వన్నెల దొరసాని'తో సింహద్వారం ద్వారా చలనచిత్రరంగ ప్రవేశం. ఆ సినిమాకు అన్ని పాటలు నేను రాసినవే.

ఎన్.టి.ఆర్ ఆహ్వానంపై మద్రాసు వెళ్ళినప్పుడు రైల్వే స్టేషన్‌లో ఆయనే స్వయంగా స్వాగతం పలికారు. గుమ్మడి, మిక్కిలినేనితో నాకు సాన్నిహిత్యం పెరిగింది. సెలవు దినాలలో మద్రాసులో గీత రచన చేసేవాణ్ని.

50 మందికి పైగా సంగీత దర్శకులతో కలిసి పనిచేశాను. వీరిలో తెలుగు సంగీత దర్శకులే కాక శంకర్–జయకిషన్, సి. రామచంద్ర, ఒ.పి. నయ్యర్, రవీంద్రజైన్, ఉషాఖన్నా, బప్పీలహరి వంటి ప్రముఖ హిందీ సంగీత దర్శకులున్నారు. ఘంటసాల గళంలో నా గీతాలు అధికంగా వచ్చాయి. ఇటీవల 'అరుంధతి', 'మేస్త్రీ' సినిమాలకు గీతాలు రచించాను. నా చలనచిత్ర గీతాలపై ప్రముఖ సాంస్కృతిక సంస్థలు అనేక సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. సమయం లేకపోవడం చేత మరికొన్ని వివరాలలోకి వెళ్ళలేకపోతున్నాను.

**13. పురస్కారాలు:**

'పరిణతవాణి' ప్రసంగానికి ఏర్పరచిన చట్రం ప్రకారం కొన్ని వివరాలు తప్పక చెప్పాలి. వాటిలో పురస్కారాలు కూడా వున్నాయి.

నా 'రుతుచక్రం' కావ్యానికి రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు, 'మంటలూ–మానవుడూ' కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించాయి. భారతీయ భాషా పరిషత్ పురస్కారం, కుమార అసన్ అవార్డు, రాజ్యలక్ష్మి అవార్డు ఇంకా చాలా అవార్డులు లభించాయి. విశ్వంభర కావ్యానికి గాను నాకు భారతీయ జ్ఞానపీఠ పురస్కారం లభించింది.

ఈ కావ్యం గురించి ఒకమాట చెప్పాలి. నేను గేయఛందస్సులో నాలుగు సమగ్ర కావ్యాలు రాశాను. వచన కవితా ప్రక్రియలో కావ్య నిర్మాణం చేయాలనిపించింది. అయితే కథాత్మక కావ్యంలో విశేషమేమీ వుండదని భావించాను. అందుకే కథారహితంగా, ఏ పాత్రలూ వాచ్యంగా కనిపించకుండా విలక్షణ శిల్ప సంవిధానంతో ఈ కావ్యం రాశాను. వస్తూన్మీలనంలో, వాక్య నిర్వహణలో కావ్య వైశిష్ట్యాన్ని పాఠకలోకం, పండిత సమూహం గుర్తించింది. ఈ కావ్యానికి నేపథ్యం ప్రకృతి; నాయకుడు మానవుడు; రంగస్థలం విశాల విశ్వంభర; మనశ్శక్తులు మనిషి ధరించే వివిధ భూమికలకు మూలధాతువులు. ఆదిమదశ నుంచీ ఆధునిక దశ వరకు మనిషి చేసిన ప్రస్థానాలు ఈ కావ్యంలోని ప్రకరణాలు.

**14. సత్కారాలు:**

నేను సహజంగా సత్కారాలు స్వీకరించేందుకు సమ్మతించను. అయినా కొన్ని అనివార్యం. వాటిలో ప్రత్యేకంగా చెప్పతగినవి మీరట్, నాగార్జున, ఆంధ్ర, కాకతీయ, డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు, భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ, పద్మభూషణ్ గౌరవాలు.

**15. ఇతర రాష్ట్రాలలోని కార్యక్రమాలు:**

ఇతర రాష్ట్రాలలో వున్న ఆంధ్ర సంఘాల ఆహ్వానంపై ఢిల్లీ, ముంబాయి, కోల్‌కతా, బెంగుళూరు, మైసూరు, భువనేశ్వర్, షోలాపూర్, నాగపూరు, కొచ్చిన్ మొదలైన అనేక ప్రాంతాలలోని సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నాను.

**16. విదేశీ పర్యటన:**

అమెరికా, ఇంగ్లీషు, ఫ్రాన్సు, జపాను, రష్యా, కెనడా, ఇటలీ, డెన్మార్కు, థాయిలాండ్, యుగోస్లేవియా, గల్ఫ్ దేశాలు, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియా, మారిషస్ మొదలైన దేశాలు సందర్శించాను. అక్కడ తెలుగువారిని కలుసుకున్నాను. 1990లో యుగోస్లేవియాలోని 'స్రూగా'లో జరిగిన అంతర్జాతీయ కవి సమ్మేళనంలో భారతీయ భాషల ప్రతినిధిగా నేను పాల్గొన్నాను. 40 దేశాల కవులిందులో కవితలు వినిపించారు.

**17. సాంస్కృతిక సంస్థలతో సాన్నిహిత్యం:**

రాష్ట్రంలోను, జంట నగరాలలో వున్న ప్రముఖ సాహితీ, సాంస్కృతిక సంస్థలన్నింటితో నాకు సన్నిహిత సంబంధం వుంది. ఎప్పటికప్పుడు నా సూచనలు అందుకుంటున్నారు. అవి విశేష సేవలందిస్తున్నాయి. వారు నా కార్యక్రమాలలో సహకరిస్తున్నారు. అన్నీ వివరించాలని వున్నా సమయం చాలదు. వాటిలో ఒకటి, రెండు పేర్కొంటాను. 'రసమయి' శ్రీమతి సుశీలా

నారాయణరెడ్డి సాహిత్య పురస్కార సభను నిర్వహిస్తోంది. 'వంశీ' సంస్థ జులై 29న నా జన్మదినం సందర్భంగా గ్రంథావిష్కరణ సభ జరుపుతోంది. కరీంనగర్‌లో నా సాహిత్యాభిమానులు జి. లక్ష్మణరావు సారథ్యంలో ప్రతి సంవత్సరం సినారె సాహితీ పురస్కారం ఉత్తమ కవితా సంపుటికి ప్రదానం చేస్తున్నారు. అలాగే పాలకొల్లులో డా. గజల్ శ్రీనివాస్ సినారె కళాపీఠం నెలకొల్పి ఏటా సాహితీ పురస్కారం ఇస్తున్నారు.

నేను 1969 నుంచి 1973 వరకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యునిగా సేవలందించాను. లోగడ దక్షిణ భారత హిందీ ప్రచార సభ వారి 'స్రవంతి' పత్రికకు గౌరవ సంపాదకుడిగా వున్నాను.

ఆంధ్ర సారస్వత పరిషత్తు నా మాతృసంస్థ. దీనితో అయిదు దశాబ్దాల అనుబంధం వుంది. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి వంటి మహనీయులు 1943లో స్థాపించిన ఈ మహా సంస్థకు డా. దేవులపల్లి రామానుజరావు గారి కృషి అసామాన్యం. ఆయన స్వర్గస్థులైన పిమ్మట నేను 1994లో అధ్యక్ష బాధ్యత స్వీకరించి నా సేవలందిస్తున్నాను. పరిణతవాణి ప్రసంగాలు, సదస్సులు, చర్చాగోష్ఠులు, వివిధ కళోత్సవాలు, ప్రసంగాత్మక ప్రదర్శనలు, గ్రంథావిష్కరణలు, శిక్షణ శిబిరాలు వంటి విలక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పండిత శిక్షణ కళాశాల, ప్రాచ్య కళాశాల, ఇంకా తెలుగుభాషా పరీక్షల ద్వారా పరిషత్తు భాషా సేవ చేస్తున్నది.

**18.** ఇంత సుదీర్ఘ ప్రసంగం ముగించేముందు పరిణతవాణి ప్రసంగ పథకం ప్రకారం యువతరానికి సందేశం అందివ్వడం. నేను వారికి చెప్పేది ఒక్కటే......................